కథానిక:

# ★ తీరని కోరిక ★

రచన:

డి. వి. రమణమూర్తి

ఆకాశంలో స్వేచ్ఛగా పరుగులెత్తే తెలి మబ్బులమల్లే విచ్చలవిడిగా ఆడుకుంటున్న పిల్లలూ వాళ్ళ కేరింతలూ మనశ్శాంతి కోసం కూర్చున్న నా ధ్యానాన్ని ఆకర్షించినై. అటు ప్రక్క తిరిగి చూచాను. ఆ పిల్లల గుంపులో ఒకమ్మాయిని చూడగానే 'శోభ' గుర్తుకొచ్చింది. ఆ పాప మూడు మూర్తులా 'శోభ' లానే వుంది. ఆమె గుర్తుకు రాగానే నా కళ్ళు చెమ్మగిల్లినై. కళ్ళలో తిరిగిన నీళ్ళనుండి బయట ప్రపంచం అంతా మసక మసకగా కనిపించింది. ఆ మసకదనం నుంచి కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక హృదయ విదారకమైన సంఘటన తెరమీద జరిగే సినీమాలా గోచరించింది.

* * *

నా ఉద్యోగం బదిలీ కావడం వలన నేనా పట్నం వెళ్ళడం జరిగింది. అక్కడ నా ఉనికి తాత్కాలికం మాత్రమే అందు చేత కుటుంబాన్ని తరలించేకంటే ఆ ఒక సంవత్సరం హోటల్‌లో వుండి కాలక్షేపం చేద్దామని నిశ్చయించుకున్నాను. కాని అక్కడే ఓ మూల క్లుప్తంగా నిరాడంబరంగా చిన్న గుమాస్తా ఉద్యోగంలో జీవిస్తున్న నా బాల్య మిత్రుని బలవంతం చేత అతనింట్లోనే వుండాల్సి వచ్చింది.

చెప్పడం మరిచా. నా మిత్రుడి పేరు కమలనాభం. మేమిద్దరం ఒకే యీడు వాళ్ళమైనా, అతను నా కంటె చాలా సంవత్సరాల పెద్దవాడిలా కనిపించేవాడు. విపరీత పరిస్థితులు మానవులను మానసికంగా వార్ధక్య పరుస్తాయి. తద్వారా శారీరకంగా కూడా మనిషిలో ముసలితనం కనిపిస్తుంది. అతన్ని విపరీతంగా కృంగదీసిన పరిస్థితులలో, ఒకటి, అమితంగా తనను ప్రేమించే భార్య మరణం, రెండవది, ఆమె విడిచి పోయిన ఒకే ఒక ఆడబిడ్డను సాకడానికి తనుపడే జీవన సంఘర్షణ.

కమలనాభం ఇంట్లో అడుగు పెట్టగానే నేను చూచిన దృశ్యం- ఆ గదిలోవున్న ఒక కిటికీగుండా బయట ప్రపంచాన్ని చూస్తున్న ఒక అమ్మాయి మా ప్రవేశం వలన కలిగిన చప్పుడుకు ఓసారి మమ్మల్ని చూసి. ఆశ్చర్యం వ్యక్తపరచి మళ్ళీ తన ధోరణిలో పడింది.

ఆ అమ్మాయి ముఖానికంతా శోభ తెచ్చేవి ఆమె మీనాల్లాంటి కళ్ళు, సంపెంగ మొగ్గలాటి ముక్కు, చిన్న నోరూ అని అనిపించింది నాకు. అమ్మాయి చూడ్డానికి ముచ్చటగా వుంది. వయస్సు బహుశా తొమ్మిదేళ్ళు వుంటాయి.

కమలనాభం ఆ అమ్మాయిని చూపుతూ "ఇదే శోభ" 'నా కూతురు. పోతూ పోతూ నా భార్య దీన్ని నా చేతిలో పెట్టి, దీని క్షేమం కోసం నేను పునర్వివాహం చేసుకోనని చేతిలో చెయ్యి వేయించుకుంది. ఇహ నా జీవితానికి ధ్యేయమల్లా దీన్ని సాకి ఒక యింటిదాన్ని చేయడమే. ఇంకొక ధ్యాసా వేరొక ఆశా నాకింకేమీ లేవు" అన్నాడు కమలనాభం పండిన వేదాంతిలా.

"పోని శోభ పెళ్ళి తర్వాత అంటే మరో అయిదారు సంవత్సరాల తర్వాత నన్నా నువ్వు పెళ్ళిచేసుకోవచ్చునుగా. నువ్వే ముసలివాడివైపోయావా యేమిటి?" అన్నాను

"నా హృదయాన్ని పూర్తిగా ఆక్రమించుకుని వెళ్ళిపోయింది శారద. అందులో ఇంకొక స్త్రీ మూర్తికిలేశమైనా స్థానంలేదు. అంటూ అక్కడినుండి కదిలి శోభదగ్గరికెళ్ళాడు కమలనాభం.

నేనూ అతడిని అనుసరించాను.

"శోభా! ఇటు చూడమ్మా! బాబాయి వచ్చారు. నమస్కరించు" అన్నాడు కమలనాభం.

"శోభ నమస్కరించింది. వెంటనే తన వ్యాపకంలో నిమగ్నురాలైంది.

"పిచ్చి పిల్ల" అన్నాడు కమలనాభం గోముగా.

అక్కడేముందనీ అంత నిదానంగా చూస్తుంది అన్నాను.

"అదంతా తర్వాత చెప్తాలే" అని నిట్టూర్చి" ముందు స్నానం అదీ కానీయ్. కేరేజి రెడిగా వుంది భోంచేద్దాం" అన్నాడు.

* * *

శోభకు నా దగ్గర చనువు బాగా యేర్పడే వరకూ ఆమె అక్కడేమి చూస్తుందో నేనడగలేదు. కాని నేనా యింట్లో కాలు పెట్టిన నాటిరాత్రి కమలనాభంద్వారా సాంతంగా విన్నాను.

ఒకనాడు కిటికీలోంచి బయటకిచూస్తున్న శోభ వెనుక నిలుచుని 'శోభా' అని పిల్చాను.

వెనక్కి తిరిగి నా వంక చూసి "ఏం బాబాయ్" అంది.

"ఇక్కడ నుంచుని నువ్వు రోజల్లా చూసేదేంటమ్మా" అని అడిగాను.

"ఇన్నాళ్ళైంది మీ రొచ్చి ఆ మాత్రం తెలియదా? బలే బాబాయ్ మీరు ఈ కిటికీలోంచి ఒక్కసారైనా చూశ్ళేదా అలా ఎదురుగ్గా చూడండి" అంటూ ఆమె కాస్తంత జరిగి నాకు చోటిచ్చింది.

నేను కిటికీలోనుండి ఏమీ తెలియని వాడిలా బయటికి చూడ్డం ప్రారంభించాను. ఆమె వ్యాఖ్యానం ప్రారంభించింది.

"ఆపార్కు ఎంత అందంగావుందో చూశారా బాబాయ్, అక్కడ పిల్లలంతా ఎంత సరదాగా ఆడుకుంటున్నారో" అంటూ నావంక చూచింది. కళ్ళలో సంతోషం ఉట్టిపడుతోంది.

అక్కడ నేను చూసిన దల్లా నిరుపేదల పూరిగుడిశెలు, మురుకుప్పలూ, కార్పొరేషన్ వాళ్ళ అపట్నపు పెంటనంతా పోగుచేసే విశాలమైన ఖాళీ స్థలమూ మాత్రమే.

"ఏం బాబాయ్ చూశావా" అందిశోభ.

"ఆఁ ఆఁ అన్నానునేను.

"చూడు బాబాయ్ మరి నాన్నక్కడికి వెళ్ళొద్దంటాడు" అంది దీనంగా.

ఆ మాటకు నేనేం చెప్పాలో తెలియని అయోమయ స్థితిలో పడిపోయాను. కాస్తంత తేరుకున్నాను.

"అవునమ్మా వాళ్ళంతా అల్లరి పిల్లలు. నీ అంత మంచి వాళ్ళుకారు. అక్కడికి నువ్వు వెళితే వాళ్ళు నిన్ను కొడతారు. అందుకేనాన్న నిన్నక్కడికివెళ్ళొద్దన్నారు" అన్నాను.

"అయితే వెళ్ళను లెండి" అంది శోభ సంతృప్తిగా.

* * *

ఆఫీసునుండి ఇంటికి వచ్చే సరికి కిటికీలోనుండి ఆహ్వానించే శోభ పిలుపు ఆవేళ లేకపోవడంతో, మాకు ఆశ్చర్యాన్నే గాకుండా భయాన్నికూడాకలిగించింది లోపలికివెళ్ళి చూసేసరికి శోభ తన మంచంమీద జ్వరంతో పడుకుని వుంది.

ఆమె ప్రక్కనే కూర్చుని అకస్మాత్తుగా ఆమెలో కలిగిన మార్పుకు కారణాలు అన్వేషిస్తున్నాం, నేనూ మా కమలనాభం.

"అది పార్కు కాదూ" అనే మాటలు సన్నగా శోభనుండి విన్నాము.

మా గుండెలు గతుక్కుమన్నవి "ఆమె స్వప్న స్వర్గాన్ని ఎవరో కూలద్రోశారు" అన్నాడుకమలనాభం కారణం తెలుసుకుని.

"అంటే ?" అర్థంకాని నా ప్రశ్న అది.

"అక్కడ పార్కు లేదనీ పిల్లలు ఆడటంలేదనీ అంతా ఆమె భ్రమనీ మనం లేనప్పుడు ఈ యింటి ఇరుగు పొరుగుల వాళ్ళెవరో చెప్పివుంటారు. దానితో మానసికంగా దెబ్బతిని వుంటుంది అన్నాడతడు ఏమి చేయాలో తోచక బరువెక్కిన గుండెతో.

అతడు కనుగొన్న కారణం నిజమే అనిపించింది నాకు.

* * *

అనాటినుండి శోభ కిటికీ దరిదాపులకు చేరలేదు ఆమె తన కాల్పనిక జగత్తులో నిర్మించుకుని ఆనందిస్తున్న క్రీడావనం కలగా కరిగిపోయిన తర్వాత ఆ కిటికీ దగ్గరకెళ్ళే అవసరం కనిపించలేదు.

దినమంతా తన చిన్న మంచంమీద పడుకుని ఇంటి పైకప్పును చూస్తూ దానిలోనుండి శూన్యంలోకిచూస్తూ నిరుత్సాహంగా రోజులు గడిపేది

ఆ చక్కని కళ్ళల్లోని కాంతులు, ముఖంలోగల సౌకుమార్యమూ శరీరంలోని శక్తి రోజురోజుకీ సన్నగిల సాగాయి.

శోభను ఒక పిల్ల స్పెషలిష్టుకు చూపించాం. అతడి ఫీజుకైన ఖర్చుకు మా యిద్దరి దగ్గర మొత్తం కలిపితే చాలక కాస్తంత బదులుకూడా చేయాల్సి వచ్చింది.

స్పెషలిష్టు విదానంగా పరీక్షచేసి శారీరకమైన జబ్బు ఏమీలేదు. మానసికంగా ఏదో బాధ పడుతోంది. అది మీకు తెలిసి వుండాలి.

ఈ పరిస్థితుల్లో ఈమెకు కావలసినదల్లా బాగా రిక్రియేషన్, పరిశుభ్రమైన గాలి బలమైన ఆహారం. దానికి తోడు ఈ టానిక్కు కూడా వాడండి" అంటూ ఓ చీటీ వ్రాసిచ్చి వెళ్ళాడు.

స్పెషలిస్టు వెళ్ళింతర్వాత కమలనాభం నా వంక నీరసంగా చూశాడు. డాక్టరు సూచించి, విధంగా ఆచరించే స్థోమత మా యిద్దరికీ అప్పట్లో లేదని తెలుసునాకు.

* * *

ఓనాడు కొన్ని మైళ్ళదూరంలో వున్న సిటీ పార్కుకు శోభను తీసుకెళ్ళాడు కమలనాభం. వాళ్ళు తిరిగి వచ్చే సరికి బాగా చీకటి పడింది.

ఇంట్లోకి వస్తూనే నన్ను చూస్తూ "బాబాయ్ మీరుకూడా రావలసింది, నాన్నా నేనూ పెద్ద పార్కుకు వెళ్ళాం. ఎంత బావుందనుకున్నారు" అన్నది శోభ హాయిగా నవ్వుతూ కమ్మగా మాట్లాడుతూ.

ఇంక శోభ ఆరోగ్యం కుదుటబడుతుందనుకున్నా.

"ఇక్క పార్కు లేకపోతే నాకేం. రోజూ అక్కడికే వెళ్తా. రేపు మళ్ళీ వెళ్తాను" అన్నది పాపం. ఆ వెళ్ళడానికి ఎంత ఖర్చు అవుతుందో ఆమెకేం తెలుసును.

కాని ఆ రేపు వెళ్ళడమనేది మళ్ళీ జరుగలేదు. మర్నాడు హోరుమని వర్షం కురిసింది. ఆ తర్వాత మా యిదరిలో ఎవరికీ ఆఫీసునుండి వేగం ఇంటికి వెళ్ళడం పడలేదు. వీటన్నిటికీ మించింది, ఏరోజుకారోజే డబ్బుకు చాలా అవస్థగా వుండేది. ఈ లోగా శోభలో నిరాశా నిస్పృహ అధికమైనాయి.

ఓనాడు అకస్మాత్తుగా శోభకు తీవ్రంగా జ్వరం తగిలింది. అసలే నీరసంగావున్న శోభ ఆజ్వరం తీవ్రతకు తట్టుకోలేకపోయింది. ఆజ్వరంలో కలవరించటం ప్రారంభించింది.

"రేపురేపు అంటారు, ఎప్పుడూ తీసుకెళ్ళరు" అంటూ ఏడ్చింది.

తన అసమర్థ జీవితానికి అధ్వాన్నపు ఆర్థిక పరిస్థితికి క్రుంగి పోయాడు కమలనాభం. దురదృష్టవశాత్తు నేను కూడ అప్పుడు అదే స్థితిలో వున్నాను.

ఆ పరిస్థితిలో నడిసముద్రంలో మునిగి పోయే నావలో వున్నట్లనిపించింది. వెంటనే

(తరువాయి 21 వ పేజీలో)

## తీరని కోరిక

(12వ పేజీ తరువాయి)

డాక్టరు దగ్గరికెళ్ళి కాళ్ళావేళ్ళా పట్టుకుని బ్రతిమిలాడి తీసుకొచ్చాను.

అపస్మారక మంచంమీద కూతురు ముఖం లోకి నిశ్చేష్టుడై చూస్తున్న కమలనాభం మమ్మల్ని చూచి బావురుమన్నాడు. కూతురు మీద వ్రాలిపోయాడు.

డాక్టరుగారు వెళ్ళిపోయారు.

"నా కూతురుని నేనే చేతులారా పొట్ట బెట్టుకున్నాను. దాని కనీస కోర్కె అయినా తీర్చలేపోయాను. అది తీరని కోరికతో మనకి దూరమైంది." అంటూ నా గుండెమీద వ్రాలి ఏడ్చాడు.

* * *

ఇద్దరమూ శ్మశాన వాటికకు వెళ్ళి శోభకు చేయవలసిన అంత్యక్రియలు జరిపించి ఇంటికి వస్తున్నాము. ప్రతి నిత్యం శోభ పార్కుగా భ్రమించే ఆ పెంటపోగుల స్థలం దగ్గర కొంత మంది పనివాళ్ళుచేరి దాన్ని శుభ్రంచేస్తున్నారు. అది చూచి నేను వాళ్ళని కారణం అడగకుండా వుండలేకపోయాను.

"ఇక్కడ ఒక పార్కు తయారవుతుంది బాబూ. దీని చుట్టూ గవర్నమెంటు వారు గుమస్తాలకోసం ఇళ్ళు కడతారంట" అన్నారు ఆ పనివాళ్ళు అది విని నేను చూచాను. అసలే బరువెక్కిన హృదయాలకు ఆ మాట మరింత బాధను కలిగించింది అయినా విషాదచ్ఛాయలతో నిండిన కమలనాభం ముఖంలో ఒక చిన్న వెలుగురేఖ మెరిసింది. కాని అదెంతోసేపు వుండలేదు. అది మెరుపులాగే మాయమైపోయింది. అతని గుండెలో దుఃఖం కరిగి కన్నీళ్ళుగా మారి జలజలా రాలిపోయాయి.

ఇద్దరం బరువుగా అడుగులు వేసుకుంటూ మౌనంగా ఇల్లు చేరుకున్నాం ఇద్దరి హృదయాల్లోనూ ఒకటే తలపు శోభ బ్రతికివుంటే ఈ పార్కు దాన్నెంత ఆనంద పర్చి వుండేదో" అని.

ప్రతిరోజూ మమ్మల్ని ఆహ్వానించే శోభ పిలుపు శాశ్వతంగా కరువైపోయింది ఇల్లంతా ఏదో పోగొట్టుకున్నట్టుగా దిగాలుగా శూన్యంగా వుంది

ఇంట్లో అడుగుపెట్టిన మాకు మంచం ప్రక్కనే ఆమె దుస్తులు పెట్టి, గోడ మేకుకు తగిలించిన గౌను, రెండు మూడు రబ్బరు బొమ్మలు చూచిన వెంటనే దుఃఖం ఆగలేదు కమలనాభం కుప్పగా కూలిపోయాడు. నేనతన్ని ఓదార్చడానికి ప్రయత్నిస్తూ ఉమర్ ఖయామ్ రుబాయిత్ ఒకటి చెప్పాను

"జీవితం ఒక చదరంగపు బల్ల అందులో పగలూ రాత్రి తెలుపూ నలుపూ గళ్ళు లాంటివి విధి జీవితాన్ని పావులు చేసి ఆడుతుంది. తన కిష్టమైన పావుని ముందుకు నడుపుతుంది. లేనిపావును ఓ ప్రక్కకు నెట్టేస్తుంది- లేదా తీసివేస్తుంది"

అతడు తలెత్తి చూసి కళ్ళు తుడుచుకుని "ఈ యిల్లు మార్చేద్దాం రంగనాథం అనుక్షణం శోభను గుర్తుచేసే ఈ యింట్లో మనకు శాంతిలేదు" అన్నాడు కమలనాభం.

"అలాగే" అన్నాను. లేచి అనుకోకుండా కిటికీ దగ్గరికి వెళ్ళాను. అక్కడి నుండి దూరంగా కనిపిస్తున్న దృశ్యాన్ని చూచాను.

"అక్కడే ఒక అందమైన కాలనీ. దాని మధ్య సుందరమైన పూలమొక్కలతో పార్కు, ఆ పార్కులో పిల్లల దోబూచులాట. అందులో శోభ దొంగగావున్నట్లు నా కళ్ళకు కనిపించింది.

* * *

శోభ స్మృతిలోంచి తేరుకున్న నేను ఇంక పార్కులో కూర్చోలేకపోయాను. ఇంటికివెళ్ళి కమలానాభానికి ఉత్తరం వ్రాయాలని లేచిపోయాను.

[ఒక ఆంగ్ల కథ ఆధారంగా]

—:O:—

## దివ్యక్షణం

ఎన్నడో....
ఎప్పుడో....
ఊహించలేనట్టి
ఓదివ్య నిముసాన
ప్రాణికోటుల నడుమ
మానవత్వపు మహిమ
జలపాత వేగాన
జాలు వారును కరుణ
సంద్రాలు సంబ్రాన
ఎగసి గానాజ్ఞేయు
కఠిన హృదయుల ప్రేమ
అంబరపుహద్దుల నధిగమించు
నవరసము లొలికించు
హృదయాంచలాలు
అఖిల జగమ్ము జగమ్ము
అనురాగ మయమవును
సుమసౌరభాల్ మోయుజాలక
పవనుండు మందగమనుడౌను
వికృతమై, కఠోర, ఘోరమైనట్టి
'జీవితపు కాలనాగు' కాటుదిన్న
విన్నబోయిన దీనుల
ముఖమండ లాల్వెలుగు
భాషకందని వింత దీప్తితోను
నీలాల నింగిలో నిగనిగా మెరిసేటి
నీహారికలు దిగివచ్చి మరిపోవు
దివికి
అదో దివ్యక్షణం కదూ?

"కరుణ"